# పరిహారం.. కుటుంబానికి అభయం

- 'రైతుబీమా'తో అన్నదాతలకు ధీమా
- ఏ కారణంతో రైతు మృతిచెందినా ఫ్యామిలీకి రూ.5 లక్షలు
- పాస్ పుస్తకం ఉన్న ప్రతి ఒక్కరికీ వర్తింపు
- జిల్లాలో ఐదేళ్లలో 4,198 రైతు కుటుంబాలకు రూ.209.90 కోట్ల బీమా సొమ్ము అందజేత
- రైతు కుటుంబాలకు అండగా నిలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- సాయం చేసిన సీఎం కేసీఆర్‌ను మరువమంటున్న బాధిత కుటుంబాలు



బాధిత కుటుంబ సభ్యులకు బ్యాంకు ద్వారా జమ అయిన నగదు అందజేత (ఫైల్)

మధిర, నవంబర్ 6 : రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ప్రతి సీజన్ అదునులో రాయితీపై విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారు. పంటలకు 24 గంటలపాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు. రైతుబంధులో భాగంగా ఏడాదిలో ఎకరానికి రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ప్రమాదవశాత్తు రైతు మృతిచెందితే ఆ కుటుంబం రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో 2018 ఆగస్టు 15 నుంచి 'రైతుబీమా' పథకాన్ని అమలు చేస్తున్నది. ఒక్కో రైతుకు రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నది. ఈ మేరకు 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)'కు ప్రీమియం చెల్లిస్తున్నది. రైతు ఏ కారణంతో మృతిచెందినా సరే మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందుతున్నది. జిల్లాలో ఐదేళ్ల కాలంలో 4,198 రైతు కుటుంబాలకు రూ.209.90 కోట్ల బీమా సొమ్మును అందజేసింది. పథకం ఐదేళ్ల నుంచి అమలవుతుండగా.. ఆగస్టు 16 నుంచి ఆరో సంవత్సరంలోకి అడుగు పెట్టింది. సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతుబీమాతో కొండంత అండగా నిలిచినందుకు రైతు కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## బాధిత రైతు కుటుంబాలకు సర్కారు భరోసా..

రైతుబీమా పథకంతో జిల్లాలోని రైతులు ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నారు. దీంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై రైతులు, వారి కుటుంబాలకు మరింతగా విశ్వసం పెరిగింది. ఐదేళ్లలో జిల్లాలో 2018లో రైతులు 813 మంది మృతిచెందగా.. రూ.40.65 కోట్లు వారి కుటుంబ సభ్యుల ఖాతాల్లో జమ చేశారు. 2019లో 840 మందికి రూ.42.00 కోటు, 2020లో 1,209 మందికి రూ.60.45కోట్లు, 2021లో 895 మందికి రూ.44.75 కోట్లు, 2022లో 441 మందికి రూ.22.05 కోట్లు.. జిల్లాలో మొత్తం 4,198 మంది రైతు కుటుంబాలకు రూ.209.90 కోట్లను అందించారు. మధిర నియోజకవర్గంలోని మధిర, బోనకల్లు, చింతకాని, ముదిగొండ, ఎర్రుపాలెం మండలంలోని 979 రైతు కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున రూ.48.95 కోట్లు బాధిత రైతు కుటుంబాలకు బీమా సొమ్ము చెల్లించింది.

## ఏ కారణంతో మృతిచెందినా..

వాస్తవానికి సాధారణ పౌరుడు బీమా పాలసీ తీసుకోవాలంటే ఎన్నో నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఉదాహరణకు.. ఒక వ్యక్తి రూ.5 లక్షల బీమా తీసుకోవాలంటే ముందుగా వైద్య పరీక్షలు తప్పనిసరి. వయస్సు పెరిగిన కొద్దీ ప్రీమియం పెరుగుతుంది. బీమా తీసుకోవడానికి ముందే ఆ వ్యక్తికి వ్యాధులు ఉంటే ప్రీమియం మరింత ఎక్కువవుతుంది. కొన్ని వ్యాధులకైతే వెయిటింగ్ పీరియడ్(వేచి ఉండే సమయం) ఉంటుంది. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉంటే బీమా కంపెనీలు అసలు బీమానే ఇవ్వవు. ఇక ఆత్మహత్యలు, ఉద్దేశపూర్యకంగా ఘర్షణల్లో పాల్గొని మృతిచెందిన వారికి, హత్యకు గురైన వారికి బీమా అందే అవకాశమే లేదు. ఏ క్షణంలోనైనా మృతిచెందే అవకాశం ఉన్న పోలీసులు, జవాన్లు, రాజకీయ నాయకులకూ బీమా సంస్థలు బీమా ఇచ్చేవి కావు. కానీ.. తెలంగాణ ప్రభుత్వం బీమా సంస్థతో చర్చలు జరిపి రైతు కారణంతో మృతిచెందినా మృతుడి కటుంబానికి రూ.5 లక్షల చొప్పున బీమా పరిహారం ఇవ్వాలని ఒప్పందం చేసుకుని పథకాన్ని అమలు చేస్తున్నది.

## సామూహిక బీమా..

తక్కువ వయసులో ఉన్నప్పుడు, వ్యాధులు అంతగా లేనప్పుడు తీసుకునే బీమా పాలసీలకు (రిస్క్ తొందరగా ఉండదు కాబట్టి) ప్రీమియం చాలా తక్కువగా ఉంటుంది. వయస్సు పెరిగే కొద్దీ బీమా సంస్థలు ప్రీమియాన్ని పెంచుతూ ఉంటాయి. కానీ.. 'రైతుబీమా' సామూహిక బీమా కాబట్టి సాధారణ నిబంధనలు వర్తించడం లేదు. సామూహిక బీమా కాబట్టే అందరికీ ఒకటే ప్రీమియం. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి వ్యక్తికీ హెల్త్ బీమా ఉంటుంది. నిజానికి బీమా వినియోగంలో మన దేశం ఇంకా వెనుకబాటులోనే ఉండడంలో సందేహం లేదు. 1991-92లో సరళీకృత ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చినందున ఎన్నో బహుళజాతి సంస్థలు దేశంలో పెట్టుబడులు పెట్టాయి. బీమా రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. మల్హోత్రా కమిటీ సిఫార్సుల మేరకు 1999లో ఐఆర్‌డీఏఐ ఏర్పడింది. తరువాత 2000లో సంస్థకు స్వయం ప్రతిపత్తి వచ్చి రాజ్యాంగ సంస్థగా ఏర్పడింది. అప్పటి నుంచి బీమా రంగం ప్రాచుర్యంలోకి వచ్చింది. గతంలో బీమాకు పట్టణ ప్రాంతాల్లోనే ప్రాధాన్యం ఉండేది. సీఎం కేసీఆర్ మాత్రం రైతుల కోసం పట్టణాల నుంచి మారుమూల గిరిజన గూడేలకు చెందిన రైతులకూ బీమా వర్తింపజేస్తున్నారు.

## బీమా వర్తింపు ఇలా..

సాధారణంగా బీమా ప్రీమియాన్ని చెల్లిస్తున్నప్పుడు ఎంతో కొంత రిటర్నులు(తిరిగి పొందడం) ఆశిస్తుంటారు పాలసీదారులు. ఇప్పటి వరకూ చాలామంది చెల్లిస్తున్న బీమా పాలసీల్లో సేవింగ్స్ పాలసీలు, మనీ బ్యాక్ పాలసీలు, చిన్నారుల భవిత కోసం పొదుపు చేసే పాలసీలు, యూలిప్ పాలసీలే అధికం. ఇవి ఎక్కువ మొత్తానికి జీవిత బీమా(మనిషి విలువ అత్యల్ప మొత్తానికి)ను కల్పించినా ఈ పాలసీలన్నింటికీ మెచ్యూరిటీ టైం ఉంటుంది. ఆ టైంలో ఎంతో కొంత రాబడి వస్తుంది. కానీ.. టర్మ్ పాలసీలు భిన్నమైనవి. వీటికి మెచ్యూరిటీ ఉండదు. మెచ్యూరిటీ గడువులోగా రిస్క్ జరిగితేనే పరిహారం అందుతుంది. లేదంటే ప్రీమియం చెల్లింపులు వృథానే. ఒక్క పైసా వెనక్కు రాదు. అందుకే ఇవి చాలా తక్కువ ప్రీమియానికి అత్యధిక అష్యూర్డ్‌ను అందిస్తాయి. రైతుబీమా కూడా సరిగ్గా ఇదే. రిస్క్ జరిగితే వెంటనే క్లెయిమ్ సెటిల్ అవుతుంది.

### బీమాతో ధీమాగా ఉన్నాం



మాకు ఎకరం పొలం ఉంది. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే నా భర్త కరోనాతో మృతి చెందాడు. ప్రభుత్వం రైతుబీమా వర్తింపజేయడంతో మా కుటుంబానికి కొండంత భరోసా కల్పించినట్లైంది. నా భర్త కరోనాతో చనిపోయిన పది రోజుల్లో రైతుబీమా ద్వారా రూ.5 లక్షల సాయం చేసి మా కుటుంబానికి ధీమా కల్పించి పెద్దదిక్కు అయ్యారు. ఇంత సాయం చేసిన సీఎం కేసీఆర్ సార్‌ను ఎప్పటికీ మరువం.

**– పంతంగి లక్ష్మి, రైతుబీమా లబ్ధిదారు, మాటూరుపేట**

### కొండంత అండగా నిలిచింది



సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబీమా పథకం నా కుటుంబానికి అండగా నిలిచింది. ఏడాది క్రితమే అనారోగ్యంతో భర్తను పోగొట్టుకున్నాను. ఏ కార్యాలయానికి తిరగకుండానే వారం రోజుల్లో నా అకౌంట్‌లో రూ.5 లక్షలు జమ అయ్యాయి. ఇద్దరు కూతుళ్లున్న నాకు రైతుబీమా ద్వారా వచ్చిన రూ.5లక్షలతో భర్త ఆస్పత్రి ఖర్చులు, పెద్దకూతురు పెళ్లి ఖర్చులు అన్నీ కలిపి మిగిలిన అప్పు రూ.2 లక్షలు తీర్చేశాను. అలాగే ఆసరా పింఛన్ ద్వారా రూ.2,016 నెలనెలా నా బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి. ఇంతగా సాయపడుతున్న సీఎం కేసీఆర్ సార్ ఎల్లప్పుడూ సల్లగుండాలే.

**– ఎలగందుల ఈశ్వరమ్మ, లబ్దిదారు, ప్రొద్దుటూరు**

---

# ఉమ్మడి జిల్లాలో.. మూడోరోజు 24 నామినేషన్లు



ఆర్డీవో మంగీలాల్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం

ఖమ్మం, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది శాసనసభ నియోజకవర్గాలకు నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. బరిలో నిలిచే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేస్తున్నారు. సోమవారం ఉమ్మడి జిల్లా నుంచి 24 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగనున్నది. ఖమ్మం నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గుంటి నాగరాజు, బాణాల లక్ష్మణాచారి నామినేషన్లు దాఖలు చేశారు. పాలేరు నియోజకవర్గం నుంచి ఇస్లావత్ రాజేందర్, హలావత్ శోభన్‌బాబు, అజ్మీరా కిషన్, అల్లిక వెంకటరమణి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. వైరా నియోజకవర్గం నుంచి గుగులోతు బావ్‌సింగ్, మాలోతు శ్యాంలాల్ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. మధిర నియోజకవర్గం నుంచి ఆధార్ పార్టీ నుంచి అంబోజు బుడ్డయ్య నామినేషన్ వేశారు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా చిప్పలపల్లి వీరయ్య నామినేషన్ దాఖలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి యువతరం పార్టీ తరపున ప్రవీణ్‌కుమార్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి చీమల వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నుంచి మోకాళ్ల కృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పాయం వెంకటేశ్వర్లు నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పాల్వంచ దుర్గ, వాసం మంగయ్య, భద్రాచలం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున తెల్లం వెంకట్రావు, తెల్లం సీతమ్మ నామినేషన్ దాఖలు చేశారు. ఇదే నియోజకవర్గం నుంచి పాండ్రు హేమసుందర్ స్వతంత్ర అభ్యర్థిగా రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి మెచ్చా నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఇదే నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా కల్లూరి కిశోర్, అంగోతు కృష్ణ, కుంజా నాగమణి, కంగాల కల్లయ్య నామినేషన్లు దాఖలు చేశారు. కాగా.. ఈ నెల 10వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనున్నది. నామినేషన్ల స్వీకరణకు ఇంకా నాలుగు రోజులు మాత్రమే గడువు ఉండడంతో పోటీ చేసే ఆశావహులు మంచి ముహూర్తం కోసం వేచి చూస్తున్నారు.

---

# బీఆర్ఎస్ గెలిస్తేనే మరిన్ని పథకాలు

- కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి
- గిరిజనుల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం: కో ఆర్డినేటర్ చంద్రావతి



బూరేనిగుట్టతండాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ బానోత్ చంద్రావతి, చిత్రంలో ఎమ్మెల్యే కందాళ

కూసుమంచి, నవంబర్ 6: బీఆర్ఎస్ మళ్లీ గెలిస్తేనే రాష్ట్రంలో మరిన్ని పథకాలు అమలవుతాయని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే ప్రస్తుత సంక్షేమ పథకాలు కొనసాగుతాయని అన్నారు. సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన విధంగా పాలేరులో బీఆర్ఎస్ గెలిస్తే ఎన్నికలు ముగిసిన వెంటనే నియోజకవర్గంలోని ఎస్సీలందరికీ దళితబంధు పథకాన్ని వర్తింపజేస్తామని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు నిలిపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కూసుమంచి మండలంలో సోమవారం పర్యటించిన ఆయన.. మల్లేపల్లి, జక్కేపల్లి ఎస్సీకాలనీ, జక్కేపల్లి, భగవాన్‌తండా, బూరేనిగుట్ట తండా, హీరామాన్‌తండా, ఎర్రగడ్డతండా, దుబ్బతండా, నర్సిహులగూడెం, నానుతండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆయనకు మహిళలు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కందాళ మాట్లాడుతూ.. స్థానికుడిగా తాను ఇక్కడి ప్రజల కష్టసుఖాల్లో పాల్పంచుకున్నానని గుర్తుచేశారు. మీ గ్రామాల్లో సమస్యలను ప్రత్యేకంగా తెలుసుకొని వాటిని పరిష్కరించానని అన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన వాటిని సమకూర్చానని వివరించారు. మీకు మరింత సేవ చేసేందుకు ఈ ఎన్నికల్లో మీ ఆశీర్వాదం కావాలని కోరారు. కారుగుర్తుకు ఓటు వేసి మరోసారి తనను గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. వైరా మాజీ ఎమ్మెల్యే, పాలేరు నియోజకవర్గ సమన్వయకర్త బానోత్ చంద్రావతి మాట్లాడుతూ.. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన గిరిజనాభివృద్ధికి పాటుపడిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మరో సమన్వయకర్త తాళ్లూరి జీవన్ మాట్లాడుతూ.. తెలంగాణ సిద్ధించాకే ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాయని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు బాణోత్ శ్రీనివాస్, చాట్ల పరశురాం, రామభారపు రమేశ్, బజ్జూరి రాంరెడ్డి, బాణోత్ రాంకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, కొత్తా రాంరెడ్డి, రామసహాయం బాలకృష్ణారెడ్డి, ఇంటూరి శేఖర్, ఇంటూరి బేబీ, నల్లబోలు చంద్రారెడ్డి, వేముల వీరయ్య, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.